ప్రజాశక్తి
బుధవారం 22 ఫిబ్రవరి 2023 5
శ్రీ సత్యసాయి

పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి

బతికుండగానే చంపేశారు..!

ఆ ఇద్దరూ బతికే ఉన్నారు... అందులో ఒకరు మక్కాయాత్రకు వెళ్లారు.... మరొకరు బంధువులు అనారోగ్యంగా ఉన్నారని తెలిసి పరామర్శించడానికి వేరే ఊరు వెళ్లారు. అలా వెళ్లే సమయంలో ఈ ఇద్దరూ వారి పరిధిలో ఉన్న వార్డు వాలంటీర్ సహకారంతో సచివాలయ ఉద్యోగికి తాము ఈనెల పింఛను తీసుకునే సమయంలో అందుబాటులో ఉండమని లిఖిత పూర్వకంగా అర్జీ రాసి ఇచ్చి వెళ్లారు. అయినా సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యానికి ఆ ఇద్దరూ బతికుండగానే చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు అయ్యింది. హిందూపురం పురపాలక సంఘంలోని 16వ వార్డు రహమత్ పురంలో చోటుచేసుకున్న ఈ ఘటన సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

- సచివాలయ ఉద్యోగుల నిర్వాకం
- రెండు నెలలుగా ఆగిన పింఛన్
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన సౌలభ్యం కోసం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. అభివద్ధి నుంచి సంక్షేమం వరకు అన్ని శాఖలకు సంబంధించి సెక్రటరీలను నియమించింది. వీరితో పాటు 50 గహాలకు ఒక వార్డు వాలంటీర్‌ను నియమించి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఇచ్చే ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే క్షేత్ర స్థాయిలో కొందరు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. హిందూపురం పురపాలక సంఘంలోని రహమత్‌పురంలోని 16వ వార్డు సచివాలయ పరిధిలోని గుల్షిరా, అబీదాలు సామాజిక పింఛన్లు తీసుకుంటున్నారు. కాగ వీరిలో గుల్షీరా మక్కాకు వెళ్లింది. అబిదా ఢిల్లీలోని బంధువుల ఇంటికి వెళ్లింది. వీరిద్దరూ నవంబర్‌లో పింఛను తీసుకుని డిసెంబర్ తాము వ్యక్తిగత కారణాల వల్ల తాము అందుబాటులో ఉండడం లేదని వాలంటర్ ద్వారా సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీకి లిఖిత పూర్వకంగా లేఖ ఇచ్చారు. డిసెంబర్ 1వ తేదీ పింఛన్ వచ్చింది. లబ్ధిదారులు ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో దీనిపై ఏ మాత్రం విచారణ చేయకుండా, కనీసం వాలంటీర్‌ను కూడా సంప్రదించకుండా మరణించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో జనవరి నెల పింఛను రాలేదు. జనవరి నెలలో ఇంటి వద్ద ఉన్న ఇద్దరూ 1వ తేదీన పింఛన్ కోసం వాలంటీర్‌ను సంప్రదించారు. సచివాలయంకు పింఛన్ ఐడిను చూడగా ఇద్దరూ మృతి చెందినట్లు ఆన్‌లైన్‌లో ఉంది. దీంతో ఇద్దరు లబ్ధిదారులు ఖంగుతున్నారు. వీరికి జరిగిన అన్యాయంపై పలుమార్లు సచివాలయ వెల్ఫేర్‌ను సంప్రదిస్తే వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దాదాపు రెండు నెలలుగా వీరు పింఛన్ పునరుద్ధరణ కోసం సచివాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో చేసేది లేక ఇద్దరు మహిళలు నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి వారి సమస్యను విన్నవించారు. బతికుండగానే రికార్డుల్లో తమను చంపేశారని, పరిశీలించి న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. పరిశీలించి పింఛను పునరుద్ధరణ అయ్యేలా చూస్తామంటూ కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

పింఛన్‌ను పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్‌ను వేడుకుంటున్న బాధిత మహిళలు

ఇబ్బంది పడుతున్నా : గుల్‌షిరా

బతికున్న తనను రికార్డుల్లో మరణించినట్లు ధ్రువీకరించారు. దీంతో పింఛన్ ఆగిపోయింది. రెండు నెలలుగా పింఛను సొమ్ము అందక ఇబ్బంది పడుతున్నాను. దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న తాను పింఛను డబ్బుతో మందులు కొనుగోలు చేసుకుని ఒకరి మీద ఆధారపడకుండా జీవిస్తున్నాను. సచివాలయ ఉద్యోగులు చేసిన తప్పునకు నేను ఇబ్బందులు పడుతున్నాను.

సచివాలయం చుట్టూ తిరుగుతున్నా : అబీదా

అకారణంగా పింఛన్‌ను తొలగించారు. దీనిని పునరుద్ధరించాలని రెండు నెలల నుంచి సచివాలయం చుట్టూ తిరిగితున్నాను. అయినా ఎవరూ పట్టించుకోడం లేదు. ఈ నెల, మళ్లీ నెల అంటూ సాకులు చెబుతున్నారు. పింఛను డబ్బుతోనే నేను జీవనం సాగిస్తున్నాను. అధికారులు స్పందించి తన పింఛన్‌ను పునరుద్ధరించాలి.

నేడు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-అనంతపురం

పశ్చిమ రాయలసీమ స్థానం నుంచి ఎమ్మెల్సీలుగా మండలి ఎన్నికల బరిలోనున్న ఇద్దరు అభ్యర్థులు బుధవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజు పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) అభ్యర్థులుగా బరిలోనున్న విషయం తెలిసిందే. ఈ ఇద్దరికి సిపిఎం, సిపిఐతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఇద్దరూ నేడు నామినేషన్లు దాఖలు చేయనుండటంతో అందరూ మద్దతుగా పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు గుత్తి రోడ్డులోని ద్వారకా చలమారెడ్డి ఫంక్షన్ హాలు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో వారికి మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, సామాజిక వేత్తలు అందరూ పాల్గొననున్నారు.

నామినేషన్ మహోత్సవానికి తరలిరండి
పోతుల నాగరాజు

అనంతపురంలో బుధవారం నాడు కడప, కర్నూలు, అనంతపురం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పీడీఎఫ్ అభ్యర్థిగా వేస్తున్న నామినేషన్ కార్యక్రమానికి ఉద్యోగులు, యువత, ప్రజలు తరలి రావాలని పోతుల నాగరాజు కోరారు. ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న గొంతుకు అండగా నిలవాలని కోరారు. తనకు విద్యారంగ సమస్యలపై పూర్తి అవగహన ఉందని పేర్కొన్నారు. పాలక ప్రభుత్వాలపై ప్రజా సమస్యలపై గొంతెత్తే అవకాశం కల్పించేందుకు మండలి ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. పేదలు, అణగారిన వర్గాలకు విద్యా, వైద్యం అందించేలా ఒత్తిడి తీసుకొస్తానన్నారు. తన పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. యువత, విద్యారంగ నిపుణులు ప్రతి ఒక్కరూ నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎసిబి వలలో విఆర్ఒ

రూ.4వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు గ్రామ రెవెన్యూ అధికారి చిక్కాడు. మ్యూటేషన్ చేయడానికి ఓ రైతు నుంచి రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని మంగళవారం సాయంత్రం ఆయన్ను పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన యాలేటి ప్రదీప్‌కుమార్‌రెడ్డి తండ్రి యాలేటీ లక్ష్మిరెడ్డి 2021 జనవరి 11వ తేదిన మృతి చెందారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి తల్లి లక్ష్మిదేవి పేరు మీద పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుతో పాటు భూమికి సంబంధించిన పత్రాలన్నీ అందజేసినా పాసుపుస్తకాలు మంజూరు చేయకుండా విఆర్ఒ తిరస్కరించారు. దీనిపై ప్రదీప్‌కుమార్‌రెడ్డి విఆర్ఒ నరసింహులును సంప్రదించగా నాలుగు వేల రూపాయలు లంచమడిగారు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వల పన్నీ కొత్తపల్లి గ్రామంలోని సర్పంచి నివాసంలో రూ.నాలుగు వలు లంచం తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని విఆర్ఒ నరసింహులును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డీఎస్పీ కంజక్షన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచమడిగితే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ మోహన్ ప్రసాద్, శంకర్‌రెడ్డి, సిబ్బంది శాంతిలాల్, శివ గంగాధర్‌రెడ్డి, ఎస్ఐ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఎసిబికి పట్టుబడిన విఆర్వో

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఐసిడిఎస్ రీజినల్ డైరెక్టర్ పద్మజ

కదిరి టౌన్ : అంగన్వాడీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టి అక్రమంగా వసూళ్లకు పాల్పడిఉంటే చర్యలు తప్పవని ఐసిడిఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ హెచ్చరించారు. పది రోజుల కిందట అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎ. సిరికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కదిరి పడమర ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ఏళ్ల తరబడి తిష్ట వేసి అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రాజెక్టు డైరెక్టర్ సిరి ఆదేశాల మేరకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ మంగళవారం కదిరి పడమర ప్రాజెక్టును తనిఖీ చేశారు. అవినీతి అక్రమాలపై అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశమై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో చోటు చేసుకున్న అక్రమాలపై డైరెక్టర్ విచారణకు ఆదేశించారన్నారు. ఆమె ఆదేశాల మేరకు విచారణకు వచ్చామన్నారు. అమడగూరు, ఒడిసి, నల్లమాడ పరిధిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రతి పనికి కార్యకర్తల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని ఏళ్ల తరబడి అధికారులు తిష్ట వేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారన్నారు. ప్రాజెక్టు లో సంవత్సరాల తరబడి తిష్ట వేసిన అధికారులను బదిలీ చేస్తామని చెప్పారు. విచారణ చేస్తున్నామని నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఆధ్వర్యంలో వినతి : సత్య సాయి జిల్లా పరిధిలో పెండింగ్ బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుందని, ఇంటి అద్దెలు, కూరగాయలు, గ్యాస్ బిల్లులు మూడు సంవత్సరాల నుండి అందడం లేదని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీలు రీజినల్ డైరెక్టర్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రాజెక్టు పరిధిలో కొందరు వర్కర్లకు వేతనాలు పడడం లేదన్నారు రిటైర్మెంట్ పొందిన వారికి బెనిఫిట్స్ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు, లక్ష్మీనారాయణ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పనిసరిగా ఎన్నికల నియమ, నిబంధనలు పాటించాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల రిసెప్షన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, ఆర్డీవో భాగ్యరేఖతో కలిసి మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని చిన్నపల్లి, ఎనుములపల్లి ఉన్నత పాఠశాలలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ కు 43వేలు, ఉపాధ్యాయులకు 3200 ఓటర్లు ఉన్నారన్నారు. 86 పోలింగ్ స్టేషన్‌లను జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. 11 రూట్లను గుర్తించినట్లు చెప్పారు.

ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించాలి : డిఆర్ఒ

జిల్లాలో ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సెక్టార్, రూట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. రూట్ ఆఫీసర్లు పిఒలు, ఎపిఒలు సమన్వయంతో పని చేయాలన్నారు. సెక్టార్ అధికారులు ముందుగా పోలింగ్ కేంద్రాలను సందర్శించి అవసరమైన సౌకర్యాలు గుర్తించి, వాటిని పూర్తి చేయాలన్నారు. ఇదివరకే ఎన్నికల విధులలో పాల్గొన్న అధికారులు గత అనుభవాలను దష్టిలో ఉంచుకుని పనిచేయాలన్నారు. 24 లోగా నివేదిక తనకు సమర్పించాలన్నారు. మార్చి 12లోగా ఎన్నికల సామగ్రిని తరలించేందుకు వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సులను పుట్టపర్తి ప్రధాన కేంద్రం నుంచి పంపిణీ చేస్తామన్నారు. మార్చి 13న జరిగే ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మైముద్దీన్‌తోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

మృత్యుంజయ హోమం నిర్వహణ...

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన మృత్యుంజయ హోమం రాజ్యంగ స్ఫూర్తికి విరుద్ధమని తక్షణం దీనిని ఆపాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృత్యుంజయ హోమం నిర్వహణ ప్రజల్లో మూఢ విశ్వాసాలను పారదోలి, సైన్సు పట్ల అవగాహన కల్పించాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యని పేర్కొన్నారు. శాస్త్రీయ ఆలోచనల వైపు ప్రజలను నడిపించాలని రాజ్యాంగం చెబుతోందన్నారు. ఉన్నత విద్యా కేంద్రంగానున్న శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అక్కడి సిబ్బంది చనిపోయారని, వారి సంక్షేమానికి యాగం చేస్తామని వైస్ ఛాన్సలరు చెప్పడం సరైంది కాదని అన్నారు. ఏ పరిస్థితుల్లో అక్కడ మరణాలు సంభవించాయో గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిపోయి హోమాలు నిర్వహించడం, అది కూడా అందరి నుంచి డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరైనా వారి ఇళ్ల వద్ద చేసుకుంటే ఎవరికీ ఎటువంటి అభ్యంతరాలుండవని చెప్పారు. విశ్వవిద్యాలయంలో పాలకవర్గం పేరుతో చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇది మృత్యుంజయ హోమం కాదని, మారణహోమం అని ఎద్దేవా చేశారు. విశ్వవిద్యాలయంలో జరిగిన మరణాలకు వైస్ ఛాన్సలర్ తీరే కారణమని మండిపడ్డారు ఆయన చేసిన మానసిక ఒత్తిడితోనే సిబ్బంది చనిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యలు హోమాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు ఎనుముల నరేష్, బీసీ,ఎస్సీఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్‌యాదవ్, ఎఐఎస్‌బి జిల్లా ప్రధన కార్యదర్శి పృధ్వి, పిడిఎస్‌యు నాయకులు శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, జెవివి నాయకులు రామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, చంద్ర, రజిత, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

హిందూపురంలో బడిబస్సుకు ప్రమాదం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన బస్సుకు తటిలో తప్పిన ఘోర ప్రమాదం తప్పింది. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి విద్యార్థులను ఇంటికి తరలిస్తున్న బస్సు డీజిల్ ట్యాంకు క్లాంపులు కట్ కావటంతో ట్యాంకు ఆర్‌పిజిటి రోడ్డులో ఊడిపోయింది. దీనిని గమనించకుండా బస్సు డ్రైవరు సుమారు అర కిలో మీటరు మేర వెళ్లాడు. రోడ్డుపై బస్సు డీజిల్ ట్యాంకులోని డీజిల్ కారుతూనే ముందుకు వెళ్తుండగా శ్రీనివాస థియేటర్ నుంచి మేళాపురం ప్రాంతం వరకు రోడ్డు పక్కన ఉన్న ప్రజలు కేకలు వేశారు. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. వెంటనే బస్సులో ఉన్న 25 మంది విద్యార్థులనుకిందకు దించారు. డీజిల్ ట్యాంకర్ రోడ్డుపై పడిన సమయంలో నిప్పులు రాజుకుని ఉంటే పెనుప్రమాదం జరిగేది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ దృశ్యాన్ని చూసి షాక్ తిన్నారు. డీజిల్ ట్యాంక్ జాయింట్ కట్ కావడం వల్ల ఇలా జరిగిందని డ్రైవర్ ముజీబుల్లా తెలిపారు.

కిందికి పడిపోయిన బడిబస్సు డీజిల్ ట్యాంకు

ఇఎస్ఐ ఆసుపత్రి సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఇఎస్ఐ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను సిపిఎం, సిఐటియు నాయకులు కలిసి ఇఎస్ఐ అసుపత్రిలో నెలకొన్న సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఇంతియాజ్‌తో పాటు సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఈఎస్ఐ అసుపత్రి అని, ఈ అసుపత్రిలో మందులే కాదు..సిబ్బంది సైతం లేరని అన్నారు. దీంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం ప్రాంతంలో ఉందన్నారు. ఇక్కడ దాదాపు 50వేల మందికి పైగా కార్మికులు వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్నారన్నారు. ఇందులో దాదాపు 20వేల మందికి పైగా ఇఎస్ఐ సేవలు పొందుతున్నారని చెప్పారు. కోట్నూరు, హిందూపురం రెండు ఇఎస్ఐ డిస్పెన్సీరీలను ప్రభుత్వం మంజూరు చేసినా స్థలం లేకా పోవడంతో రెండు డిస్పెన్సీరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారని తెలిపారు.. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారన్నారు. దీంతో పాటు ఇతర సిబ్బంది 19 మంది ఉండాల్సిన చోట కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారని చెప్పారు. మందుల విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిత్యం కార్మికులకు అవసరమైన షుగర్, బిపి, థైరాయిడ్ ఇతర అత్యవసర మందులు సైతం సరఫరా చేయడం లేదన్నారు. దాదాపు లక్ష మందికి వైద్య సేవలు అందల్సిన అసుపత్రిలో వెయ్యి మందికి సైతం సేవలు అందడం లేదని వాపోయారు. స్థానిక ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సేవలు సరిగా అందకపోవడంతో, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించుకుని దానికి సంబంధించిన బిల్లులు కార్మికులు ఇఎస్ఐ అధికారులకు సమర్పిస్తే, ఆరు నెలలు గడిచిన బిల్లులు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ప్రతి నెల కార్మికులు ఇఎస్ఐ ప్రీమియం చెల్లిస్తూ, వైద్య సేవల కోసం మళ్లీ అప్పులు చేసి, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఇఎస్ఐ కార్డు ఉన్నవారికి వైద్య సేవలు అందించడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడమేనని అన్నారు. ప్రతినెల ప్రభుత్వం ఇఎస్ఐ రూపంలో కార్మిక వేతనాలు నుంచి కోత విధించి ఖజానా నింపుకుంటుందే తప్ప కార్మికుల సంక్షేమాన్ని మాత్రం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 50 పడకలతో ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ అసుపత్రి హిందూపురానికి మంజూరైనా స్థలం లేక పోవడంతో ఇంత వరకు వాటి పనులు ప్రారంభం కాలేదన్నారు. అసలు దానికి సంబందించి ఎవరు ఎటువంటి సమచారం ఇవ్వడం లేదని, వీటిపై సమగ్రంగా అధికారులతో చర్చించి, సమస్యలను పరిష్కరించి కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్సీ వెంటనే అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ప్రీకాట్ బి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జయరాం రెడ్డి, కోశాధికారి నందీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రజకులను విస్మరించిన వైసిపి

ధర్మవరం టౌన్ : రజకులకు మరోసారి వైసీపీ మొండిచేయి చూపిందని రజక సాధికారకమిటి హిందూపురం పార్లమెంట్ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి విమర్శించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ హాయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రజకులకు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారన్నారు. అయితే ప్రస్తుత సిఎం రజకులకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించకపోవడం చూస్తుంటే రజకులపై ఆపార్టీకి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు.బీసీలలో అత్యధిక జనాభా కల్గిన సామాజిక వర్గాల్లో రజక సామాజికవర్గం ఒకటని అన్నారు. ఎన్నికలకు ముందు రజకులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని మరచిన ఘనత జగన్ కే దక్కుతుందని విమర్శించారు.

కెజిబివి తనిఖీ

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని కెజిబివిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల, తరగతి గదులు, నీటి ట్యాంకులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు హ్యాండ్ వాష్ ఆరోగ్య విషయాల గురించి సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి లక్ష్మీనారాయణ, రాఘవేంద్ర, కెజిబివి ప్రిన్సిపల్ రూపారాణి, ఎఎన్ఎం శంకరమ్మ, రమేష్ రెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈడిగలకు అన్యాయం : టిడిపి

పుట్టపర్తి రూరల్: ఈడిగ సామాజికవర్గ వారు ఎమ్మెల్సీ పదవికి అర్హులు కారా అని టిడిపి జిల్లా ఈడిగ సాధికార జిల్లా కమిటీ కన్వీనర్ నీళ్ల రమణ గౌడ్ ప్రశ్నించారు. 18 మందిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించిన వైసిపి అధినేత జగన్ బిసిలలో అత్యధిక జనాభా కలిగిన గౌడ సామాజిక వర్గం నుంచి అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

విరివిగా ఉపాధి పనులు

ఓబులదేవర చెరువు : పని అడిగే ప్రతి ఒక్కరికీ ఉపాధి ఎ పనులు కల్పించాలని ఎంపీడీవో పోలప్ప అధికారులకు సూచించారు. మండల పరిధిలోని చింతామనుపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. పనులు చేసే చోట కల్పిస్తున్న సౌకర్యాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతిరోజూ రూ.257 కూలి వచ్చే విధంగా పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో ఈవోఆర్డీ రాజశేఖర్, టిఎలు, ఎఫ్ఎలు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని అల్లుగుండుగ్రామంలోని పాలకమ్మచెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ శకుంతల మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ. 257 రావాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజుల, ఈసీ బాలూనాయక్, టీఏ గంగాధర, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం

నంబుల పూలకుంట : బాల్య వివాహలు లేని మండలంగా నంబులపూలకుంట మండలాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేద్దామని తహశీల్దార్ రవినాయక్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనం నందు చైల్డ్ లైన్ 1098 ప్రజా సేవా సమాజ్ కదిరి వారి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అధ్యక్షతన మండల స్థాయి బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ, చైల్డ్ లైన్ 1098 అడ్వైజరీ బోర్డును అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు బాల్యవివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంఇఒ గోపాల్ నాయక్, చైల్డ్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ కష్ణమాచారి,కదిరి చైల్డ్ లైన్ డివిజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు, ఎంపీడీవో ఆదినారాయణ, మెడికల్ ఆఫీసర్ అసియా, ఎపిఎం రమణప్ప, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయం కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులుపాల్గొన్నారు.

తలుపులలో రక్తదాన శిబిరం

తలుపుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మున్వర్ బాషా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ఈసందర్భంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్రాంతి కుమార్, ఎంఇఒ వెంకట్రాముడుతో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటనమోదు తప్పనిసరి

లేపాక్షి : రబీ సీజన్లో పంటసాగు చేసిన రైతులు తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని ఎఒ శ్రీలత కోరారు. ఈనెల 25వ తేదీలోపు పంట నమోదును పంట వేసిన ప్రతి ఒక్క రైతు నమోదు చేయించుకోవాలని సూచించారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు పరచాలని వినతి

పుట్టపర్తి రూరల్ : దిగుమతి చార్జీలకు సంబంధించిన హైకోర్టు ఉత్తర్వులను అమలు పర్చాలని డీలర్ల సంఘం నాయకులు డిఎస్ఒను కోరారు. ఈ మేరకు వార్డు కోర్టు ఉత్తర్వుల కాపీని డిఎస్ఒ వంశీకృష్ణకు మంగళవారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకప్ప, స్టేట్ జాయింట్ సెక్రెటరీ పరంధామరెడ్డి, పుట్టపర్తి మండల ప్రధాన కార్యదర్శి చిన్న, డీలర్లు ఈసీ వెంకట్రాముడు, గంగిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడిపి మండలస్థాయి సమావేశం

తనకల్లు : మండల కేంద్రంలో బుధవారం టిడిపి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9 :30 గంటలకు స్థానిక ఎస్ఎంఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ హాజరుకానున్నారని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, టిడిపి అనుబంధసంఘాల నాయకులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

పనుల పూర్తిపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - రొద్దం

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ గుత్తేదారులకు సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని చోలేమర్రి, కలిపి, చిన్నమంతూరు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులు, హాజరు, రైతు భరోసా కేంద్రంలో ఎరువులు స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం భవనాల నిర్మాణాల నాణ్యత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్ధాంతరంగా ఆగిన సచివాలయ, రైతు భరోసా, వైఎస్ఆర్ క్లినిక్ భవన నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని బిల్లులు కూడా సకాలంలో అందజేస్తామని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, ఎస్ఐ నాగస్వామి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

పీడీఎఫ్ అభ్యర్థుల కోసం ప్రచారం

తనకల్లు : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తినరసింహారెడ్డిని గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.వి. రమణ, జిల్లా కమిటీ సభ్యులు శివన్న, కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు ఫారెస్ తెలుగు యూత్ మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ తదితరులు మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల వాణిని చట్టసభల్లో వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

పేదలకు భూ హక్కు కల్పించండి

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, బాధితులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని కేతగాని చెరువు గ్రామానికి చెందిన దళితుల భూమి హక్కులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దళితులు కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ మురళీకృష్ణను కలసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేతగాని చెరువు గ్రామ రెవిన్యూ పొలంలోని సర్వే నెంబర్ 323లో 1.17 ఎకరాల భూమిలో 17 దళిత కుటుంబాలకు చెందిన వారు అనేక సంవత్సరాల నుంచి అనుభవంలో ఉంటున్నారన్నారు. ఈ భూమిలో డాక్యుమెంట్ నెంబర్121-2008 మేరకు నివాసాలు, గడ్డివాములు ,పాల డైరీ ఏర్పాటు చేసుకుని 30 సంవత్సరాలుగా అనుభవంలో ఉన్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు హద్దులు ప్రకారం సర్వే చేసి రికార్డుల్లో హక్కు దారులుగా నమోదు చేసి దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, సభ్యులు రవి, నాగభూషణ, శ్రీల నారాయణస్వామి, దళితులు అంజనమ్మ, వెంకట లక్ష్మమ్మ, హనుమక్క, సంజీవమ్మ, అంజనప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలివ్వండి : మండల పరిధిలోని గుడిపల్లి గ్రామాలలోని 85 మంది దళిత , బీసీ వర్గాలకు చెందిన భూమిలేని నిరుపేదలు పందిపర్తి రెవిన్యూ పొలం సర్వే నంబర్ 384 నందు దాదాపు 180 ఎకరాలు విస్తీర్ణంలో ఉమ్మడిగా సాగు చేసుకుంటున్నారని వారికి 8వ విడత భూ పంపిణీలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని వ్యకాసం నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు సంబంధిత విఆర్ఓ సాగుదారులతో కలిసి సాగు భూములను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ రైతులు సాగుచేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య , జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేషులు , సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణ , సాగు దారులు గంగాభవాని , శ్యామల , అంబికా , అంజనమ్మ , అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కిరికెర పంచాయితీ వినయాక నగర్‌కు చెందిన మస్తాన్ వలికి ఆరు నెలల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో మెడ వద్ద దెబ్బ తగిలింది. అప్పటి నుంచి అతని తల్లి మున్ని రూ.90వేలు వెచ్చించి తన కుమారుడికి వైద్య సేవలను అందించింది. అయితే స్థానిక వైద్యులు శస్త్ర చికిత్స చేయించాలని, ఇక్కడ సాధ్యం కాదని బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించారు. అయితే ప్రభుత్వ అధీనంలో ఉన్నా వాణి విలాస్ అసుపత్రిలో శస్త్ర చికిత్స చేయడానికి రూ.2లక్షలు చెల్లించాలని తెలిపారు. భర్తను కోల్పోయి, ప్రభుత్వం అందిస్తున్న వితంతు పెన్షన్‌పై ఆధారపడి జీవనం చేస్తున్న మున్నికి అదే గ్రామానికి చెందిన మనోజ్ సాయం అందించాడు. ఈ మేరకు మనోజ్ మంగళవారం బాధితులను ఎమ్మెల్సీ ఇక్బాల్ వద్దకు పిలుచుకెళ్లి సమస్యను వివరించారు. తమ గ్రామం నుంచి బాధితులకు రూ. లక్ష వరకు అందిస్తున్నట్లు మనోజ్ తెలిపారు. స్పందించిన ఎమ్మెల్సీ తన వంతుగా రూ.1.25లక్షలు అందిస్తామని, వెంటనే శస్త్ర చికిత్స చేయించాలని సూచించారు. ఇంకా అవసరమైతే సహాయాన్ని అందిస్తామని, అధైర్య పడకూడదని వారికి ధైర్యం చెప్పారు.

రోడ్డుపై మురుగునీరు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి ఎదురుగా ఉన్న మైహోం రెస్టారెంట్ సెప్టిక్ ట్యాంకు లీకై రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తుండటంతో అక్కడి నుండి వచ్చే దుర్వాసనకు ప్రజలు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెస్టారెంట్ సెప్టిక్ ట్యాంక్ నుండి నీరు లీకై రోడ్డుపైకి ప్రవహిస్తుంటే మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు రెస్టారెంట్ కు ఎదురుగా ఉన్న ప్రభుత్వాస్పత్రికి, పక్కనే ఉన్న మున్సిపల్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ మురుగునీటి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..

మురుగునీరు బయటకు వస్తున్న దృశ్యం

మాతృభాషతోనే సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

ధర్మవరం టౌన్ : మాతృభాషతోనే సంస్కృతి, సాంప్రదాయాల సంరక్షణ సాధ్యమని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జీవన్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ మాతృభాషని పరిరక్షించుకున్నప్పుడే మన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకున్న వారమవుతామన్నారు. మాతృభాష మన జీవన విధానానికి మూలాధారమన్నారు. మాతృభాషను కాపాడుకుంటూ తక్కిన భాషల్ని నేర్చుకోవడం ద్వారా శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాబియాబేగం, చిట్టెమ్మ, షమీవుల్లా. పావని, గోపాల్‌నాయక్, కిరణ్ కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, గౌతమి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ అండ్ ఫౌండేషన్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, వెంకటలక్ష్మి, రమేష్, సిఆర్‌పి అన్సర్‌ఆలీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలోని సత్య సాయి డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య మాట్లాడుతూ మాతృభాష ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు ఆదినారాయణ, వెంకటేశ్వర ప్రసాద్, చంద్రమోహన్, ఓబయ్య, వెంకటకృష్ణయ్య, ఆనంద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తల్లీకుమారుడి ఆత్మహత్యాయత్నం

కుమారుడు మృతి-తల్లి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-అమరాపురం

తరచూ తల్లిదండ్రులు గొడవపడుతున్నారని మనస్తాపానికి గురై కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది చూసిన తల్లి కూడా ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన అమరాపురం మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అమరాపురం మండల కేంద్రంలో నివసిస్తున్న నటరాజు, అనసూయమ్మల కుమారుడు ప్రశాంత్(15) అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో తరుచూ ఈ విద్యార్థి తల్లిదండ్రులు ఘర్షణ పడుతూ ఉండేవారు. మంగళవారం కూడా వారు గొడవ పడడంతో తట్టుకోలేక ఇంట్లో పురుగుల మందు తాగాడు. దీనిని చూసిన అతని తల్లి అనసూయమ్మ కూడా పురుగుల మందు తాగింది. వెంటనే గురించిన కుటుంబ సభ్యులు ఇద్దరిని చికిత్స నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విద్యార్థి ప్రశాంత్ మృతి చెందాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

చిలమత్తూరు : కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పెద్దన్నపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... హరికష్ణ(19) అనే యువకుడు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం నాడు నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈదుల ముష్టూరులో చోరీ

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు 21 పోట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు అందిందని ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. గ్రామానికి చెందిన దర్శి సునీల్ అను వ్యక్తి తన పొలంలో 60 పోట్టేళ్లను పెంచుతున్నాడన్నారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మందలోకి ప్రవేశించి 21 పాట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. వాటి విలువ సుమారుగా రూ.ఒక్క లక్ష రూపాయలు ఉంటుందన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లచెరువు : మండలపరిధిలోని జోగన్నపేట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం చెల్లాచెదురుగా పడివుండటంతో గుర్తు పట్టలేని విధంగా ఉందని చెప్పారు.

వేధిస్తున్నారంటూ మహిళ ఫిర్యాదు

అమరాపురం : తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మండల పరిధిలోని కేశవరం గొల్లహట్టి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిపై అదే గ్రామానికి చెందిన మహిళ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు పాఠశాల సమీపంలోని మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఇంటివద్దకు వచ్చి వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం ఎంఇఒ సత్యనారాయణకు ఫిర్యాదు చేసింది.ఈ సందర్భంగా గ్రామస్తులు కూడా ఉపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పాఠశాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. స్పందించిన ఎంఇఒ ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు బదిలీ చేస్తామని చెప్పారు.

బడిబస్సు ప్రమాదంతో అప్రమత్తమైన పోలీసులు

కనగానపల్లి : మండలంలో ప్రయివేటు స్కూల్ బస్సు సోమవారం ప్రమాదానికి గురైన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఉత్తర్వుల మేరకు మండలంలోని ప్రయివేటు విద్యాసంస్థల యాజమన్యాలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్ఐ హనుమంతరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సివి.రమణ, ఎంఇఒ కె.అరుణమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేట్ విద్యాసంస్థల వాహనాల విషయంలో పలు సూచనలు చేశారు. బస్సు డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని తగరకుంట, సిఎన్.కోట, మామిళ్లపల్లి, కనగానపల్లి ప్రవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో సామాజిక విప్లవం

హిందూపురం : జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో వార్డు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలెంటీర్లు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ నివాసం వద్ద పురపాలక సంఘంలోని 30 నుంచి 38 వార్డుల వరకు ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణా సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త కొండురు వేణుగోపాల్ రెడ్డి, వైస్‌ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు మద్దన జయరాములు తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రకు తరలిరండి

ధర్మవరం టౌన్ : నికర జలాల పరిరక్షణ మహా పాదయాత్ర, ప్రజా ప్రదర్శనకు తరలిరావాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీమకృష్ణ అంకాళరెడ్డి, రామకష్ణరెడ్డి, భూషణ్ కోరారు. పట్టణంలోని స్పందన ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ టీఎం బషీర్ చేతులమీదుగా పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నికర జలాల పరిరక్షణ మహా పాదయాత్ర, ప్రజా ప్రదర్శనను ఈనెల 25 నుంచికర్నూలు జిల్లా కోసిగి మండలం రాజోలిబండ తూముల దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. రాయలసీమ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరుగుతుందన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

కొత్తచెరువు : జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సాధారణ తనిఖీలో భాగంగా పుట్టపర్తి సబ్ డివిజన్ పరిదిలో లోని కొత్తచెరువు పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, స్టేషన్ లో సీజ్ చేయబడిన వాహనాలను, లాకప్ గదులను,కంప్యూటర్ గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, సిఐ జయనాయక్, ఎస్ఐ లింగన్న , పోలీసులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు : టిడిపి

పెనుకొండ, ధర్మవరంలో విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పుట్టపర్తి రూరల్: రోజురోజుకు వైసిపి నాయకుల దాడులు పెరిగిపోతున్నాయని, విచక్షణ మరిచి టిడిపి కార్యాలయం పై దాడులు చేయడం దుర్మార్గమని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వల్లభనేని వంశీ అనుచరులు, వైసీపీ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సైకోలకు గుండెల్లో భయం మొదలైందని తెలుగుదేశం పార్టీని ధీటుగా ఎదుర్కొనలేక కార్యాలయాలపై దాడులు చేయటం సిగ్గుచేటని అన్నారు. వైసిపి పార్టీ దిగజారుడు రాజకీయాలు రోజురోజుకు ఎక్కువైపోయాయని విమర్శించారు. చంద్రబాబునాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి నేరుగా ఎదుర్కోలేని వైసిపి నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని ఆయనను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రతిపక్ష నేతలపై, కార్యాలయాలపై వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. గన్నవరం తెలుగుదేశంపార్టీ కార్యాలయాలపై దాడులు చేసి కార్యాలయ సామాగ్రి ధ్వంసం చేయడం అలాగే వాహనాలు తగలబెట్టడం దుర్మార్గపు చర్యఅని అన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపి కి వెన్నులో వణుకు పుడుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారధి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. ఈమేరకు వారు మంగళవారం పట్టణంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గన్నవరం టిడిపి కార్యాలయంపైనా, టిడిపి నాయకులపైనా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసన మండలి వ్యవస్థ నే రద్దు చేయాలనుకున్న జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తాడని ప్రశ్నించారు. వేర్వేరుగా జరిగిన విలేకరుల సమావేశాల్లో సాధికారక యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు కేశవయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మునిమడుగు వెంకట రాముడు,అధికార ప్రతినిధి రాఘవీరచౌదరి, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, శ్రీరాములు, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిని తెలుగుయువత స్థానిక నాయకులు ఖండించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ సైకోల దాడిపై పోలీసులు చోద్యం చూడటం దారుణమన్నారు. జగన్ రెడ్డి రాక్షస పాలనకు ఇది పరాకాష్ట అని విమరించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసిన వారిని, చేయించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మడకశిర : టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిపై వైసిపి అల్లరిమూకల దాడిని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తీవ్రంగా ఖండించారు. పట్టాభి పై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టాభి పై జరిగిన దాడికి డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి దారుణమన్నారు.

ధర్మవరం టౌన్ : రానున్న ఎన్నికలలో ఎక్కడ ఓటమి చెందుతామోనన్న భయంతో వైసిపి రౌడీమూకలు టీడీపీ నాయకులపైనా, కార్యాలయాలపైనా దాడులకు పాల్పడు తున్నాయని టిడిపి నాయకులు విమర్శించారు.. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు గన్నవరం టీడీపీ కార్యాలయం, నాయకులపై చేసిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. దాడులకు సూత్రధారి అయిన గన్నవరం ఎమ్మెల్యే వంశీనితక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పురుషోత్తంగౌడ్, సాహెబ్బీ, చింతపులుపు పెద్దన్న, అంబటి సనత్, నాగూరుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE DISTRICT JUDGE: (M.A.C.T) ANANTAPURAMU
M.V.O.P. NO.206/2022

Betwen:
Dharmapuri Venkatadri ...Petitioner
AND
A.Adinarayana & 2 Others ...Respondents

Notice to the Respondent No.2

Venkateswara Tourist service private Ltd., rept by N.Prasad r/o plot No.1 Narayanamma Colony, Penukonda Post, Sri Satya Sai District. (Owner of the Vehicle Bus No.AP39-Y-1419)

Please take notice that the petitioner has filed the above case for claiming compensation against you and others and the same is posted to 01-03-2023 for your appearance and you are directed to appear before this Honble court on 01-03-2023 at 10.30 AM in person or through an advocate without fail, otherwise the matter will be decide set ex-parte.

(By Order of the Court)

Hearing Date: 01-03-2023

P.RAVINDRANATHA REDDY
Advocte for the Petitioner
Ananthapuramu, Cell:9441074100.